www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 26 జనవరి 2025
5
పశ్చిమ గోదావరి



పెరిగిన నిత్యావసర ధరలు తగ్గించాలి

ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కమిటీ డిమాండ్

ప్రజాశక్తి - భీమవరం

పెరిగిన నిత్యావసర ధరలు తగ్గించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. స్థానిక పార్టీ కార్యాలయంలో జిల్లా నాయకులు దండు శ్రీనివాసరాజు అధ్యక్షతన పార్టీ జిల్లా కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రజా సమస్యలపై చర్చించారు. అనంతరం జిల్లా కార్యదర్శి లంకా కృష్ణమూర్తి మాట్లాడుతూ ఉల్లిపాయలు, వెల్లుల్లిపాయలు, పప్పుదినుసులు విపరీతంగా రెండు రెట్లు పెరిగిపోయాయన్నారు. అలాగే వంట నూనెలు, బియ్యం ధరలు, కరెంటు ఛార్జీలు, పెట్రోల్, డీజిల్ ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. ఉభయగోదావరి జిల్లాల నుంచి పెట్రోల్, ఆయిల్, గ్యాస్, ఇతర రాష్ట్రాలకు తరలించుకుపోతున్నారన్నారు. ఇంటింటికీ గ్యాస్ సరఫరా చేయాలని జిల్లా కమిటీ డిమాండ్ చేసింది.

కౌలు రైతు రుణ ఘోష..!



రెండు జిల్లాల వ్యవసాయ సాగులో
కౌలు రైతులదే ప్రధాన భూమిక
పంట రుణాల మంజూరులో మాత్రం అధమం
పశ్చిమలో రూ.250 కోట్లు, ఏలూరు జిల్లాలో
రూ.170 కోట్లు రుణాలుగా మంజూరు
సాంకేతిక సమస్యలను పరిష్కరిస్తేనే రైతుకు మేలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కౌలు రైతులకు బ్యాంకు రుణాలు అందని ద్రాక్షగానే మిగులుతున్నాయి. గత ప్రభుత్వం కంటే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పంట రుణాల మంజూరు పెరిగినట్లు చెబుతున్నా, అది కంటితుడుపు చర్యగానే ఉందని చెప్పొచ్చు. సాగు చేస్తున్న కౌలురైతులకు రుణాలిచ్చేందుకు సాంకేతిక సమస్యలు అడ్డుపడుతున్నట్లు బ్యాంకర్లు చెబుతున్నారు. సమస్యలను పరిష్కరించి కౌలురైతులకు రుణాలు పూర్తిస్థాయిలో అందినప్పుడే వ్యవసాయం ముందుకు సాగే పరిస్థితి ఉంటుంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో దాదాపు మూడు లక్షల మంది కౌలురైతులు ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి. 2014-19 నడుమ టిడిపి ప్రభుత్వ హయాంలో కౌలురైతులకు జారీ చేసిన కౌలుకార్డుల లెక్కలు దీనికి ప్రత్యక్ష నిదర్శనమని చెప్పొచ్చు. వైసిపి ప్రభుత్వంలో కౌలురైతుల సంఖ్యను తక్కువగా చూపించారనే విమర్శలు వినిపిస్తున్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో పశ్చిమగోదావరి జిల్లాలో 87 వేల మందికి, ఏలూరు జిల్లాలో 65 వేల మందికి కౌలుకార్డులు ఇచ్చిన పరిస్థితి ఉంది. ఇప్పటి వరకూ పశ్చిమలో 46 వేల మంది కౌలురైతులకు రూ.250 కోట్లు, ఏలూరు జిల్లాలో దాదాపు 22 వేల మందికి రూ.170 కోట్లు పంట రుణాలు మంజూరు చేసినట్లు లెక్కలు చెబుతున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో రెండు జిల్లాల్లో కలిపి రూ.650 కోట్లు రుణాలివ్వాలని టార్గెట్ పెట్టుకోగా, ఇప్పటి వరకూ రూ.420 కోట్లు రుణాలిచ్చినట్లు లెక్కలు చూపిస్తున్నారు. రబీ సాగు మరో రెండు నెలల్లో పూర్తికానుంది. పంట రుణాలు ఇంకా ఎప్పుడు అందిస్తారో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. 2014-19 మధ్యకాలంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో కౌలురైతులకు రూ.వెయ్యి కోట్లు వరకూ రుణాలు మంజూరు చేసిన పరిస్థితి ఉంది. ఇప్పుడు మాత్రం తక్కువగా రుణాల టార్గెట్ తీసుకోవడం ఏమిటో అర్థం కావడం లేదు. ప్రస్తుతం కౌలురైతులకు మంజూరు చేసిన రుణాలు జిల్లా వ్యవసాయ రుణ ప్రణాళికలో పంట రుణాలకు కేటాయించిన బడ్జెట్‌లో ఒక్క శాతం కూడా లేదంటే ఆశ్చర్యపోక తప్పదు. కౌలురైతులకు పంట రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులు వెనుకాడుతున్నాయి. దీనిపై బ్యాంకులు వివిధ సాంకేతిక కారణాలు చెబుతూ వస్తున్నాయి. సాంకేతిక సమస్యలను పరిష్కరించి కౌలురైతులకు రుణాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్న పరిస్థితి ఉంది.

సాగు చేయని భూయజమానికి పంట రుణమా?

కౌలురైతులకు ఇస్తున్న కౌలుకార్డులపై పేర్కొంటున్న సర్వే నెంబర్లపై భూయజమానులు పంటరుణాలు ముందుగానే తీసుకుంటున్నారు. దీంతో అదే సర్వే నెంబర్‌పై కౌలురైతులకు రుణాలు ఇవ్వడం టెక్నికల్‌గా సాధ్యం కావడం లేదని బ్యాంకర్లు చెబుతున్నారు. పంట రుణం అనేది సాగుచేసే రైతుకు ఇవ్వాలి. అలాకాకుండా సాగు చేయకుండా పట్టణాల్లో నివసించే భూయజమానులకు ఏవిధంగా బ్యాంకులు పంటరుణం ఇస్తున్నాయో అర్థం కావడం లేదు. భూయజమానులకు ఇచ్చే రుణం పంటేతర రుణంగా మార్పు చేసి, కౌలురైతులకు పంట రుణాలివ్వాలి. ప్రభుత్వం ఆ దిశగా ఆలోచించకుండా మాటలతో కాలక్షేపం చేస్తోంది. కౌలుచట్టంలో మార్పులు చేస్తామని కూటమి ప్రభుత్వం చెప్పినా ఇప్పటికీ జరగలేదు. ప్రస్తుత పరిస్థితుల్లో వరిసాగులో ఎకరాకు రూ.40 వేల వరకూ పెట్టుబడి అవుతోంది. నాలుగెకరాలు సాగు చేయాలంటే దాదాపు రూ.రెండు లక్షల పెట్టుబడి అవసరం. బ్యాంకులు రుణాలివ్వకపోవడంతో కౌలురైతులు ప్రయివేటు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది. దీంతో అధిక వడ్డీల భారం పెరిగి రైతులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. ఏదైనా విపత్తులు సంభవించి పంట దెబ్బతింటే వడ్డీ వ్యాపారుల ఒత్తిడి తట్టుకోలేక కౌలురైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్న పరిస్థితి ఉంటోంది. కౌలురైతుల రుణ ఘోష రోజురోజుకూ మిన్నుముట్టుతున్నా పాలకులకు మాత్రం పట్టడం లేదు. గ్రామాల్లో అవగాహనా సదస్సులు ఏర్పాటు చేసి కౌలురైతులకు పంట రుణాలిచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సి ఉంది. అంతేకాకుండా గతంలో టిడిపి రుణమాఫీ చేసినప్పుడు కౌలురైతులకు వర్తింపజేయకపోవడంతో చాలామంది రైతులు తీవ్ర ఇబ్బందులు పడిన పరిస్థితి ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం కౌలురైతుల సమస్యను పరిష్కరించి రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలి.

పాడి రైతులను ఆదుకుంటాం

కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - ఆచంట



దూడను ఎత్తుకున్న కలెక్టర్ చదలవాడ నాగరాణి

జిల్లాలోని పాడి రైతులను ప్రభుత్వం తరపున అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని, పశువులు పెద్ద మొత్తంలో వృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. శనివారం ఆచంటలో ఏర్పాటుచేసిన ఉచిత పశు వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం పశువులకు పరీక్షల నిర్ధారణలో వినియోగించే లేబరేటరీ పరికరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా దూడల ప్రదర్శనలో పాల్గొని పుంగనూరు జాతి మినియేచర్ ఆవు దూడను ఎత్తుకుని ముద్దాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ పాడి రైతులను ప్రభుత్వం తరపున ఆదుకుంటామని, రైతులకు మేలు చేసేందుకు ప్రభుత్వం ఉచితంగా పశువైద్య శిబిరాలను ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించి మందులు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ నెల 20 నుంచి నెలాఖరు వరకూ జిల్లాలో 183 పశువైద్య క్యాంపులను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆచంట పశు వైద్యులు డాక్టర్ ఫణికుమార్ సేవలు ఇతరులకు స్ఫూర్తిదాయకమన్నారు. పశువులకు సబ్సిడీపై దాణా మంజూరుకు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి కె.మురళీకృష్ణ మాట్లాడుతూ పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాల దిగుబడి తగ్గిపోయిన వెంటనే కాల్షియం టానిక్ పెట్టడం కాదని, పచ్చిగడ్డిలో కొన్ని హానికరమైన పరాన్న జీవులు కూడా ఉంటాయని, వాటి నివారణకు పెద్ద పశువులకు ప్రతి ఆరు నెలలకూ 90 ఎంఎల్ చొప్పున నులిపురుగుల మందును ఇవ్వించాలన్నారు. ఆచంట మండల పశువైద్యులు ఫణి కుమార్, డాక్టర్ తరంగిణి దంపతుల సేవలను మెచ్చి కలెక్టర్ నాగరాణి వారిని సత్కరించారు. దూడల అందాల పోటీల్లో గెలుపొందిన దూడ యజమానులకు పశుగణాభివృద్ధి సంస్థ అందజేసిన దాణా గిన్నె, గోమార్గ ముంపు, మినరల్స్ కిట్లు అందజేశారు. పోటీలో పాల్గొన్న దూడల యజమానులకు లీటర్ల పాల క్యాన్‌లు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచి కోట సరోజిని, ఎంపిటిసి పృథ్వీకుమార్, మండల అధ్యక్షుడు కేతా మీరయ్య, జనసేన మండల అధ్యక్షుడు జవ్వాది బాలాజీ శ్రీనివాస్, తహశీల్దార్ గొట్టిముక్కల కనకరాజు పాల్గొన్నారు.

1న తణుకులో సిఎం చంద్రబాబు పర్యటన

హెలీప్యాడ్ ప్రాంతాల్లో జెసి రాహుల్‌కుమార్ రెడ్డి పరిశీలన

ప్రజాశక్తి - తణుకు



సిఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న జెసి రాహుల్‌కుమార్‌రెడ్డి

ఫిబ్రవరి 1వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తణుకులో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో శనివారం జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి స్థానిక ఎస్ఎన్‌విఎం పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలోని హెలీప్యాడ్ ప్రాంతాన్ని, ప్రత్యామ్నాయంగా తేతలి జాతీయ రహదారి పక్కన మరో హెలీప్యాడ్ ప్రాంతాన్ని తేతలి పిఎంఎవై - ఎన్‌టిఆర్ నగర్ లేఅవుట్‌ను రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ పి.రాజబాబుతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయా పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను జెసి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ చీఫ్ ఇంజినీర్ టి.పద్మనాభం, అడిషనల్ ఎస్‌పి వి.భీమారావు, ఆర్‌డిఒ ఖతీబ్ కౌశల్‌బానో, గృహ నిర్మాణ శాఖ జిల్లా అధికారి వై.హరిహరనాథ్, డిఇలు పిచ్చయ్య, బివి.రమణ, ఎం.శ్రీనివాసరావు, తహశీల్దార్ దండు అశోక్‌వర్మ, ఎంపిడిఒలు జయసాగర్ పాల్గొన్నారు.

కొల్లేరు సరస్సుపై సుప్రీంకోర్టు తీర్పు అన్యాయం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం

ప్రజాశక్తి - భీమవరం



మాట్లాడుతున్న మంతెన సీతారాం

పర్యావరణ రక్షణ పేరుతో కొల్లేరును ధ్వంసం చేస్తున్నారని, సుప్రీంకోర్టు తీర్పు చాలా అన్యాయమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం విమర్శించారు. శనివారం స్థానిక సుందరయ్య భవనంలో సిపిఎం జిల్లా కమిటీ సమావేశం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం అధ్యక్షతన జరిగింది. సీతారాం మాట్లాడుతూ ఏళ్ల తరబడి కొల్లేరు ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు, పర్యావరణ ప్రేమికులు కొల్లేరును పర్యావరణ సమస్యగానే చూస్తున్నారని తెలిపారు. కొల్లేరులోకి వస్తున్న కాలుష్యం ప్రధానంగా పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా జిల్లాల్లో ఉన్న భారీ పరిశ్రమల వ్యర్థ జలాల నుంచే వస్తోందన్నారు. అంతేగాని కొల్లేరు ప్రజల నుంచి కాదన్నారు. ఫ్యాక్టరీల కాలుష్యాన్ని అరికట్టాలని ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేస్తున్నా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పూర్వీకులు వెయ్యేళ్ల నుంచి మత్స్యకారులు, సన్న, చిన్న కారు రైతులుగా ఉంటూ జీవనం సాగిస్తున్నారని, ఆక్వా కల్చర్ వచ్చాక కొంత అభివృద్ధి చెందుతున్నారని చెప్పారు. 2006లో ఆపరేషన్ కొల్లేరు పేరుతో వేలాది ఎకరాల ఆక్వా చెరువులను అప్పటి ప్రభుత్వాలు ధ్వంసం చేశాయని తెలిపారు. 86 వేల ఎకరాల చెరువులు, 7,500 ఎకరాల సొసైటీ చెరువులు, 13 వేల జిరాయితీ భూముల చెరువులను ధ్వంసం చేశారని గుర్తుచేశారు. కొల్లేరు భూములపై స్థానిక ప్రజలకే హక్కు ఉందన్నారు. 5వ కాంటూరు నుంచి 3వ కాంటూరుకు కుదించాలని డిమాండ్ చేశారు. ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు కొల్లేరు ప్రజలకు శాపంగా మారిందన్నారు. తక్షణం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీర్పుపై ఇంప్లీట్ పిటీషన్ వేయాలని సూచించారు. గతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను తక్షణం అమలు చేయాలని, కొల్లేరు ప్రజల ఉపాధిని కాపాడాలని కోరారు. కొల్లేరు ప్రజలకు అన్యాయం జరిగితే సిపిఎం చూస్తూ ఊరుకోదన్నారు. కొల్లేరు ప్రజలకు పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా జిల్లాల నుంచి సంపూర్ణ మద్దతు సిపిఎం రాష్ట్ర కమిటీ ప్రకటిస్తుందని తెలిపారు. ప్రజలు చేసే అన్ని పోరాటాలకూ సిపిఎం అండదండలు అందిస్తుందని తెలిపారు. జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ మాట్లాడుతూ ఈ నెల మొదటి వారంలో జరిగిన సిపిఎం జిల్లా మహాసభల్లో జిల్లా వ్యాప్తంగా ప్రజలు ఎదుర్కొనే అనేక సమస్యలపై చర్చించామని తెలిపారు. అందుకనుగుణంగా భవిష్యత్ పోరాటాలను నిర్మించేలా జిల్లా కమిటీ సమావేశంలో కర్తవ్యాలను తీసుకున్నామని తెలిపారు. జిల్లాలో ఎన్నడూ లేనంతగా సంక్రాంతి అంటే కోడి పందేల పండుగగా మార్చేసి స్వయానా ప్రజా ప్రతినిధులే కోడి పందేలు, ఇతర జూద క్రీడలకు నాయకత్వం వహించడం సిగ్గుచేటన్నారు. యువతకు ఉపాధి చూపించాల్సిన ప్రభుత్వాలు నేడు విష సంస్కృతిని నింపుతోందన్నారు. ఉండి నియోజకవర్గంలో అభివృద్ధి పేరుతో ఇళ్లను, చిరు వ్యాపార షాపులను తొలగిస్తుండడం అన్యాయం అన్నారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చింతకాయల బాబూరావు, కేతా గోపాలన్, బి.వాసుదేవరావు, కౌరు పెద్దిరాజు, జిల్లా కమిటీ సభ్యులు దూసి కళ్యాణి, పొగాకు పూర్ణ, కేతా పద్మజ, జక్కంశెట్టి సత్యనారాయణ, సూర్నీడు వెంకటేశ్వరరావు, గొర్ల రామకృష్ణ, కె.తవిటినాయుడు, కానేటి బాలరాజు, ధనికొండ శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థుల్లో ప్రతిభా పాటవాలకు బాలోత్సవాలు దోహదం



ప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు

ప్రజాశక్తి - తణుకు

బాలల్లోని ప్రతిభా పాటవాలను వెలికి తీయడానికి బాలోత్సవాలు దోహదపడతాయని బాలోత్సవ నిర్వహణ కమిటీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శి పివిఎల్ నర్సింహారావు, పి.దక్షిణామూర్తి అన్నారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శ్రీశ్రీ సేవా విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో తణుకు బాలోత్సవం రెండో రోజు ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా బాలల్లో మేధాశక్తి వెలుగులోకి వస్తుందన్నారు. విద్యార్థుల్లో, బాల బాలికల్లో నిగూఢంగా ఉన్న ప్రతిభా, సామర్థ్యాల ప్రదర్శనకు బాలోత్సవాలు తోడ్పడతాయన్నారు. పిల్లల్లో శాస్త్ర, సాంకేతిక పరిశోధనల పట్ల ఉండే ఆసక్తిని ప్రోత్సహించడానికి, విద్య, సాంస్కృతిక అంశాల్లో పోటీలు నిర్వహించడానికి ఈ బాలోత్సవాలు నిర్వహించుకోవడం అభినందనీమన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో సాంకేతిక విజ్ఞానం పెరగడంతో బాల, బాలికలు, సెల్‌ఫోన్‌లకు బానిసలవుతున్నారని తెలిపారు. తద్వారా ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమౌతున్నాయన్నారు. ఈ బాలోత్సవాలు నిర్వహించి సమాజంలో మంచి, చెడు, ఆట, పాటలవైపు బాల, బాలికలను మళ్లించే ప్రయత్నమే బాలోత్సవం ద్వారా చేస్తున్నామని తెలియజేశారు.



సోదమ్మ వేషధారణలో విద్యార్థిని

రెండో రోజు అకడమిక్ కల్చరల్ పోటీలు..

క్విజ్ ఓరల్ ఫైనల్, విచిత్ర వేషధారణ (సోలో), దేశభక్తి, అభ్యుదయ, జానపద నృత్యం (బృందం), తెలుగులో మాట్లాడడం, స్పెల్ బి, మెమొరీ టెస్ట్, చిత్రలేఖనం, దేశభక్తి, అభ్యుదయ, జానపద గీతాలాపన (బృందం), మట్టితో బొమ్మలు చేయడం, కోలాటం (బృందం), పోస్టర్ ప్రెజెంటేషన్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తణుకు బాలోత్సవ కమిటీ ఉపాధ్యక్షులు జె.చంద్రప్రసాద్, సంయుక్త కార్యదర్శి బిఎం.గోపాల్‌రెడ్డి, కమిటీ సభ్యులు కట్టా బాబూరావు, మల్లిన రాజేంద్రప్రసాద్, బి.వీరభద్రరావు, యర్రా రాజ్యలక్ష్మి, సంయుక్త కార్యదర్శులు యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి టిజె.జయకుమార్, సామాజిక సేవకులు విఎ.రాజు, సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్, సిఐటియు కార్యదర్శి గుబ్బల గోపి, సిఐటియు అధ్యక్షులు నీలాపు ఆదినారాయణబాబు, ఉభయగోదావరి జిల్లా ఐలు ప్రధాన కార్యదర్శి కామన మునిస్వామి, వాన్‌బరి స్టాఫ్, వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి వల్లూరి వెంకటేశ్వరరావు, యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.హర్షవర్ధన్, ఎపిఎంఎస్‌ఆర్‌యు తణుకు అధ్యక్ష కార్యదర్శులు ఐసిహెచ్ రామకృష్ణ, ఎం.రమేష్‌బాబు పాల్గొన్నారు.



బాలోత్సవంలో చిన్నారులు

ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యం

జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - పాలకొల్లు



నియామకపత్రాలు అందజేసిన మంత్రి నిమ్మల రామానాయుడు

రాష్ట్రంలో రానున్న ఐదేళ్లల్లో యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. శనివారం పాలకొల్లు ఛాంబర్స్ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, నేషనల్ కెరీర్ సర్వీస్, బిఆర్‌ఆర్ అండ్‌జికెఆర్ ఛాంబర్స్ డిగ్రీ, పీజీ కళాశాల ఆధ్వర్యంలో ఉద్యోగ దిక్సూచి మెగా జాబ్ మేళాలో మంత్రి రామానాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన యువతీ, యువకులకు నియామకపత్రాలు అందజేసి అభినందనలు తెలిపారు. తక్కువ ఫీజులతో సేవాతత్వంతో కార్పొరేటుకు దీటుగా నాణ్యమైన విద్యనందిస్తున్న ఛాంబర్స్ కాలేజీ పాలకవర్గాన్ని, అధ్యాపకులను మంత్రి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచస్థాయి సాంకేతికతను, పరిశ్రమలను, పారిశ్రామికవేత్తలను రాష్ట్రానికి తీసుకొచ్చి యువతకు బంగారు భవిష్యత్తు అందించే దిశగా సిఎం చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. చదువు పూర్తయిన అనంతరం ఉద్యోగాల కోసం కంపెనీల చుట్టూ తిరిగే అవసరం లేకుండా చదువుకున్న కళాశాలల్లోనే జాబ్ మేళాలు నిర్వహించి పలు సంస్థల్లో ఉద్యోగావకాశాలు కల్పించేలా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ సువర్ణ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సిఎం ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రయివేటు రంగాల్లో అనేక మందికి ఉద్యోగావకాశాలు కల్పిస్తోందన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనుల కారణంగా రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పెద్ద పెద్ద సంస్థలు ముందుకొస్తున్నాయని తెలిపారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో స్కిల్ హబ్‌లు ఏర్పాటుచేసి, యువతను అన్ని రంగాల్లో నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించి ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నామన్నారు. ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించబోయే డిఎస్‌సి ఉచిత కోచింగ్‌లో భాగంగా సుమారు 700 మందికి శిక్షణ ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ దాసిరాజు, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి పి.లోకమాన్, జిల్లా ఎంప్లాయ్‌మెంటు అధికారి బి.వరలక్ష్మి, తహశీల్దార్ వై.దుర్గాకిషోర్, ఛాంబర్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఛైర్మన్ కెవిఆర్.నరసింహారావు, సెక్రటరీ కెవి.సీతారామరాజు పాల్గొన్నారు.

ప్యాకేజీ లేదు.. పునరావాసం లేదు..!



పోలవరం, కొల్లేరు ఇలా చెప్పుకుంటూ పోతే ఏదైనా కార్యక్రమం రీత్యా గూడు, కూడు కోల్పోతున్న నిర్వాసితులకు ప్యాకేజీ, పునరావాసం అందని ద్రాక్షగానే మిగులుతోంది. పోలవరం నిర్వాసితులకు ఇటీవల కొంతమందికి ప్యాకేజీ సొమ్ము అందినా అందాల్సిన వారు చాలా మంది ఉన్నారు. పూర్వ లెక్కల ప్రకారం ఇవ్వడం, ఏడున్నరేళ్ల తర్వాత ఇవ్వడంతో అర్హుల సంఖ్య పెరిగినా వారికెవ్వరికీ ప్యాకేజీ అందని ద్రాక్షగానే మిగిలింది. ఇక పరిహారం, పునరావాసం గురించి ఎంత చెప్పినా తక్కువే. నిర్వాసితుల కోసం నిర్మిస్తున్న పునరావాస కాలనీల్లో ఇళ్ల నిర్మాణం, సౌకర్యాల కల్పన నత్తనడకన సాగుతున్నాయి. ఇక నిర్మాణం పూర్తయ్యి నిర్వాసితులు నివాసముంటున్న కాలనీల్లో తాగునీరు, డ్రెయినేజీ వంటి సమస్యలతోపాటు శ్మశానం, ఉపాధి లేమి సమస్యలు నిర్వాసితులను తీవ్రంగా వెంటాడుతున్నాయి. ఇక ముంపు సమస్య ఏటా వేధిస్తూనే ఉంది. ముంపులో లేని గ్రామాలు సైతం కొద్దిపాటి వరదలకే నిండా మునుగుతున్నాయి. వీటన్నింటినీ పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఇటీవల డిఆర్‌సిలో నిర్వాసితుల సమస్యలు చర్చకు రాగా వాటి పరిష్కారానికి త్వరలో ముంపు మండలాల్లో గ్రామసభలు నిర్వహిస్తామని ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటించారు. జిల్లా యంత్రాంగం, ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టి నిర్వాసితుల సమస్యలు గుర్తించి పరిష్కరించేలా గ్రామసభలు నిర్వహించాలని బాధిత ప్రజలు కోరుతున్నారు. ఇప్పటి నుంచే దీనిపై కార్యాచరణ చేపడితే కనీసం వచ్చే జులైలో వరదల బారిన పడకుండా ఉంటామని వారు వాపోతున్నారు. మరి పాలకులు, అధికార యంత్రాంగం ఎలా ముందుకెళ్తుందో వేచిచూడాలి.

తాజాగా కొల్లేరు అంశం మళ్లీ తెరపైకొచ్చింది. కొల్లేరు ఆపరేషన్ పేరుతో 2006లో చెరువులను ధ్వంసం చేసిన సమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలేవీ నేటికీ అమలు కాలేదు. ఎకో సెన్సిటివ్ జోన్ పేరుతో కొల్లేరు పరిధిలో మానవ మనుగడే ప్రశ్నార్థకంగా మారింది. పర్యావరణ పరిరక్షణ, పక్షులకు రక్షణకు ఎవరూ అభ్యంతరం చెప్పరు. అయితే పర్యావరణానికి విఘాతం కల్గించే అంశాలపై దృష్టి సారించకుండా తీసుకుంటున్న చర్యలు కొల్లేరువాసులను అక్కడి నుంచి తరిమేసేలా ఉన్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. కనీసం గతంలో ఇచ్చిన ప్యాకేజీ సంగతి ఎలాగున్నా పర్యాటక రంగం అభివృద్ధితో ఉపాధి చూపుతామని ఇచ్చిన హామీ అమలుకు నోచుకోలేదు. దీంతో కొల్లేరువాసులు ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లే దుస్థితి దాపురించింది. బడాబాబులు మాత్రం చెరువుల సాగు యథాతథంగానే సాగుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం కొల్లేరు పరిధిని ఐదో కాంటూరు నుంచి మూడో కాంటూరుకు కుదించడంతోపాటు పర్యావరణానికి హని కలిగిస్తున్న కాలుష్యం నివారణకు చర్యలు చేపట్టాలని అక్కడి ప్రజలు కోరుతున్నారు. అదే సమయంలో కొల్లేరు జిరాయితీ భూములు పేదలకు అప్పగించి సంప్రదాయ సాగుకు అనుమతివ్వాలని కోరుతున్నారు. అయితే హామీలివ్వడంలో ముందుండే పాలకులు, అధికారులు ఆచరణలో కనీసం వాటి ఊసెత్తకపోవడం అందరినీ బాధిస్తోంది.

-వివిఎస్‌ఎస్‌వి.ప్రసాద్

ఓటు ప్రాధాన్యతను గుర్తించాలి

డిఆర్‌ఒ మొగిలి వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - భీమవరం



సీనియర్ ఓటర్లను సన్మానిస్తున్న డిఆర్‌ఒ వెంకటేశ్వర్లు

ఓటు ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాలని, ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటు ఒక ఆయుధమని డిఆర్‌ఒ మొగిలి వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో 15వ నేషనల్ ఓటర్స్ డేను పండుగ వాతావరణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా రెవెన్యూ అధికారి మొగలి వెంకటేశ్వర్లు హాజరై మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో అతిపెద్ద పండుగ జాతీయ ఓటర్ల దినోత్సవం అన్నారు. ప్రజాస్వామ్య దేశంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంలో పెద్ద పాత్ర సామాన్య ప్రజలదే అన్నారు. భారత రాజ్యాంగం కల్పించిన హక్కును ఉపయోగించుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం ఎక్కువ సార్లు ఓటు హక్కు వినియోగించుకున్న సీనియర్ సిటిజన్లను జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమంలో భాగంగా డిఆర్‌ఒ, కెఆర్‌ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, డ్వామా పీడీ, రెవెన్యూ సిబ్బంది సత్కరించారు. జిల్లాలోని వివిధ పాఠశాలల్లో ఓటు హక్కు వినియోగంపై నిర్వహించిన వ్యాసరచన, వకృత్వ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, మెమెంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కెఆర్‌ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణ రెడ్డి, డ్వామా పీడీ కెసిహెచ్.అప్పారావు, డిఇఒ ఇ.నారాయణ, కలెక్టరేట్ ఎలక్షన్ సెక్షన్ సూపరింటెండెంట్ మద్రాపు సన్యాసిరావు, జిల్లా అధికారులు, సిబ్బంది, సీనియర్ సిటిజన్స్, విద్యార్థులు, పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాల ఊసే లేదు

కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు హరికుమార్‌రాజు

ప్రజాశక్తి - భీమవరం

కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పాతపాటి హరికుమార్‌రాజు అన్నారు. కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ షర్మిల రెడ్డి పిలుపులో భాగంగా శనివారం భీమవరం కలెక్టరేట్ వద్ద తాలూకాలో కార్యక్రమాన్ని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు హరికుమార్ రాజ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు హామీలిచ్చి వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. సూపర్ సిక్స్ పథకాల్లో ఒక్క పథకాన్ని కూడా ఇప్పటి వరకు నెరవేర్చలేకపోయిందని ధ్వజమెత్తారు. హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భీమవరం నియోజకవర్గ ఇన్‌చార్జి అంకెం సీతారాం, ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షులు కాకర రాజకుమార్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సోంబాబు పాల్గొన్నారు.

రహదారి భద్రత పాటించాలి

మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ నాయక్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ప్రతి డ్రైవర్ చేతిలో ప్రజల ప్రాణాలు ఉన్నాయని గుర్తించాలని తాడేపల్లిగూడెం ఆర్‌టిఒ సురేందర్ సింగ్ నాయక్ సూచించారు. తాడేపల్లిగూడెం ఆర్‌టిఒ కార్యాలయం వద్ద జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ఆటో డ్రైవర్లు, మాక్సీ క్యాబ్, మినీ గూడ్స్ వ్యాన్ డ్రైవర్లకు రహదారి భద్రత, ట్రాఫిక్ సిగ్నల్స్ గురించి తగు సూచనలు, సలహాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షులు, మ్యాక్సీ క్యాబ్, మినీ గూడ్స్ వ్యాన్ యూనియన్ అధ్యక్షులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

హైస్కూల్ పరిశీలన

ప్రజాశక్తి - ఉండి

మండలంలోని ఎన్ఆర్‌పి అగ్రహారంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గ్రామ సర్పంచి సురవరపు కనకదుర్గ వెంకటాచార్యులు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలోని మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించడం జరిగిందని, విద్యార్థులకు భోజనం నాణ్యత గురించి అడిగి తెలుసుకోవడం జరిగిందన్నారు. పాఠశాలలోని విద్యార్థులందరూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న పౌష్టికాహారాన్ని తీసుకుని రోగ నిరోధక శక్తి పెంచుకోవాలని సూచించారు. 10వ తరగతి పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో ప్రతి విద్యార్థి ఉపాధ్యాయులు చెప్పే పాఠ్యాంశాలను శ్రద్ధగా చదివి మంచి శాతంతో ఉత్తీర్ణత సాధించి, తమ గ్రామాన్ని మండలంలో ప్రథమ స్థానంలో నిలిపేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి ముప్పూరి సువర్ణ లక్ష్మి శ్రీనివాస్, బోర్డు సభ్యులు ముద్దే సత్యనారాయణ, గ్రామపంచాయతీ కార్యదర్శి జెవిటి నాయుడు, రెవెన్యూ అధికారి గోవింద్ ఉన్నారు.

పిజిటిల సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - మొగల్తూరు

ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న పిజిటిల సమస్య పరిష్కారం కోరుతూ శనివారం బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరికి యుటిఎఫ్ నాయకులు వినతి పత్రం అందించారు. రాజమండ్రిలోని ఆమె కార్యాలయంలో కలిసిన యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.సుబ్బారావు, పి.వెంకటేశ్వరరావు, రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ చింతపల్లి కృష్ణమోహన్‌లు కలిశారు. ఈ సందర్భంగా పిజిటి సమస్యలను ఆమెకు వివరించారు. సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

గ్రామసభలో పలు అంశాలపై ఆరా

ఆచంట : సామాజిక తనిఖీ గ్రామసభ ఆచంట వేమవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించారు. ఈ గ్రామ సభలో ఎస్ఆర్‌పి గోవింద, డిఆర్‌పి సీటీ నాగరాజు వివిధ అంశాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా పాఠశాలకు విడుదలైన నిధుల సద్వినియోగం, మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ, గ్రంథాలయ పుస్తకాలు, క్రీడా సామాగ్రి, పాఠశాల ఉపాధ్యాయుల పనితీరు, విద్యార్థుల చదువు తదితర విషయాలు మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పాటు తల్లిదండ్రుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నెక్కంటి కృష్ణవేణి, పాఠశాల యాజమాన్య కమిటీ ఛైర్మన్ గుత్తుల చిరంజీవి, పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

తణుకు : తణుకు పట్టణంలోని మాంటిస్సోరి పాఠశాలలో ప్రతీ శనివారం నిర్వహించబడే పలు సాంస్కృతిక, భాషా పోటీలలో విశేష ప్రతిభ కనబరచి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు, ఈనెల 20, 21 తేదీల్లో నిర్వహించబడిన వార్షిక క్రీడోత్సవాల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు స్కూల్ డైరెక్టర్ అనపర్తి ప్రకాశరావు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. విద్యార్థులు తమకు ఆసక్తి గల అంశాల్లో రాణించేందుకు పాఠశాలలో నిర్వహించేటువంటి పలు కార్యక్రమాల్లో పాల్గొనవలసిందిగా స్కూల్ డైరెక్టర్ అనపర్తి ప్రకాశరావు విద్యార్థులను కోరారు. సుమారు 1500పైగా బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఎం.లక్ష్మి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎ.జ్ఞానమంజరి పాల్గొన్నారు.

'ఆధార్ సేవలు వినియోగించుకోవాలి'

నరసాపురం: ఆధార్ సేవలను పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య అన్నారు. శనివారం 18వ వార్డ్ వనువులమ్మ గుడి వద్ద ఉన్న అంగన్వాడీ కేంద్రంలో కొనసాగుతున్న ఆధార్ శిబిరాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈనెల 27 నుంచి 30 ఉదయం 10 గంటల నుంచి 5 గంటల వరకూ వనువులమ్మ గుడి, కృష్ణబాబు కాలనీ, గంటాలమ్మ గుడి, పీచుపాలెం, ఎన్‌టిఆర్ కాలనీ, కొండాలమ్మ గుడి అంగన్వాడీ కేంద్రంలో క్యాంపులు నిర్వహిస్తున్నారు. అవసరమైనవారు తగు పత్రాలతో వచ్చి, ఈ సేవలు పొందాలన్నారు.

గణతంత్ర వేడుకల ఏర్పాట్లు పూర్తి : జెసి, డిఆర్‌ఒ

ప్రజాశక్తి - భీమవరం

భీమవరం కలెక్టరేట్ ఆవరణలో ఆదివారం నిర్వహించబోయే గణతంత్ర దినోత్సవ వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జెసి టి.రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్‌ఒ మొగిలి వెంకటేశ్వర్లు అన్నారు. వేడుకల ఏర్పాట్లు వారు పరిశీలించారు. వారు మాట్లాడుతూ మూడు పెద్ద డయాస్‌లు, రెండు చిన్న డయాస్‌లు, ఒక గ్యాలరీ, 18 స్టాల్స్, వివిధ శాఖలకు సంబంధించి 9 శకటాలను ఏర్పాటు చేశామన్నారు. వేడుకల సందర్భంగా ప్రభుత్వ పథకాలు ప్రతిబింబించేలా శకటాలు, స్టాల్స్ ఏర్పాట్లు చేయడం జరుగుతుందన్నారు. గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ప్రోటోకాల్‌ను అనుసరించి సీట్ల ఏర్పాట్లను, స్టేజీ ఏర్పాట్లు, తాగునీటి సరఫరా, పబ్లిక్ అడ్రస్ సిస్టం ఏర్పాట్లను పటిష్టంగా ఏర్పాట్లు చేశామన్నారు. విద్యుత్ సరఫరాలో ఎటువంటి ఆటంకాలు లేకుండా చూడాలని, ప్రత్యామ్నాయంగా జనరేటర్ కూడా ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించామన్నారు. వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరం, మాస్కులు, సానిటైజర్స్, ఒఆర్‌ఎస్ ప్యాకెట్లు, అత్యవసర మందులు, అంబులెన్స్ సేవలు సిద్ధం చేశామన్నారు. వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించేలా సమన్వయంతో పని చేయాలని కోరారు. ఆర్‌డిఒ కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు వున్నారు.

గౌరవ వందన సమర్పణకు మార్టేరు విద్యార్థినులు


పెనుమంట్ర : ఈనెల 26వ తేదీ ఆదివారం రిపబ్లిక్ డే దినోత్సవం సందర్భంగా భీమవరంలోని కలెక్టరేట్‌లో అధికారులకు గౌరవ వందనం ఇచ్చేందుకు మండలంలోని మార్టేరు ఎస్‌విజి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఎంపిక అయ్యారు. ఈమేరకు స్థానిక పాఠశాలలోని స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగంలో శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయురాలు, గైడ్ కెప్టెన్ సిహెచ్.లక్ష్మీ శైలజను, ఎంపికైన విద్యార్థినుల బృందాన్ని మండల ఎంఇఒలు యండమూరి లక్ష్మీ నారాయణ, ఉంగరాల నాగేశ్వరరావు, స్థానిక పాఠశాల హెచ్‌ఎం సిహెచ్.చిన సూర్య నారాయణ రెడ్డి, ఉపాధ్యాయ బృందం, విద్యా కమిటీ సభ్యులు అభినందించారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ రిహార్సల్స్

భీమవరం : రిపబ్లిక్ డే సందర్భంగా జిల్లా కలెక్టరేట్ వద్ద గణతంత్ర దినోత్సవ వేడుకలకు సంబంధించి వేదిక, స్టాల్స్, అభివృద్ధి, సంక్షేమం సంబంధించిన శకటంలు సిద్ధమవుతున్నాయి. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. సాయుధ పోలీసులతో బాండ్స్ ప్రదర్శన జరుగుతుంది. వీరితో పాటు పిఎంశ్రీలో భాగంగా స్కౌట్స్ అండ్ గైడ్స్ కూడా ప్రదర్శనలో పాల్గొంటున్నారు. స్కౌట్స్‌కు సంబంధించి వీరవాసరం మద్దాల రామకృష్ణ ఉన్నత పాఠశాల విద్యార్థులు, గైడ్స్‌కు సంబంధించి మార్టేరు ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. స్కౌట్స్ విద్యార్థులు మాస్టర్ బి.వెంకట త్రినాధ అప్పారావు ఆధ్వర్యంలో గైడ్స్ కెప్టెన్ సిహెచ్.లక్ష్మీ శైలజ ఆధ్వర్యంలో రిహార్సల్ చేస్తున్నారు.

ఓటుహక్కు ప్రతి ఒక్కరి బాధ్యత

ఘనంగా పలుచోట్ల ఓటర్ల దినోత్సవం



తాడేపల్లిగూడెంలో సీనియర్ ఓటర్లను సన్మానిస్తున్న ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - ఉండి

ఓటు హక్కు ప్రతి ఒక్కరి బాధ్యత అని, ఆ ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని నియోజకవర్గ ప్రత్యేక అధికారి, జిల్లా పంచాయతీ అధికారి అరుణశ్రీ అన్నారు. శనివారం ఉండి మండల తహశీల్దార్ కార్యాలయంలో 15వ ఓటర్ల దినోత్సవం కార్యక్రమాన్ని మండల తహశీల్దార్ కావడి నాగార్జున ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అరుణశ్రీ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివిధ పాఠశాలలో ఏర్పాటు చేసిన వ్యాసరచన పోటీలలో విజేతలకు బహుమతులు అందజేసి, వయోవృద్ధులను సన్మానించారు. అనంతరం ఉండి తహశీల్దార్ కార్యాలయం నుంచి మెయిన్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి ఓటర్లకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. మండలంలోని కోలమూరు, ఎన్ఆర్‌పి అగ్రహారం, మహదేవపట్నం, పెద్దపుల్లేరు తదితర గ్రామాలలో ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. ఆయా కార్యక్రమాలలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు, వనిమా సుబ్బలక్ష్మి శ్రీనివాస్, నడింపల్లి సత్యనారాయణ రాజు, సురవరపు కనకదుర్గ వెంకటాచార్యులు పాల్గొన్నారు.

భీమవరం : భీమవరం ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ పెన్నాడ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ కొప్పర్తి సురేష్ మాట్లాడుతూ 2011 నుంచి ప్రతి ఏడాది జనవరి 25న ఓటర్ల దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. ఓటు అనేది రాజ్యాంగం పౌరులకు కల్పించిన హక్కు అని తెలిపారు. అనంతరం విద్యార్థులు పెన్నాడ గ్రామంలో అవగాహనా ర్యాలీ నిర్వహించి ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డీన్ డాక్టర్ కురెళ్ల భాస్కరరావు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఎబిఎస్ఆర్ మనోహర్, విద్యార్థులు పాల్గొన్నారు.


ఆచంటలో విద్యార్థులచే ర్యాలీ, మానవహారం

ఆచంట : ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండాలని తహశీల్దార్ జి.కనకరాజు సూచించారు. జాతీయ ఓటర్ల దినోత్సవ వేడుకలు శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించారు. ముందుగా విద్యార్థులచే తహశీల్దార్ కార్యాలయం నుంచి కచేరి సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీనియర్ ఓటర్లను రెవెన్యూ అధికారులు ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి కోట సరోజిని, ఎంపిడిఒ పూర్ణ బాబ్జి, డిప్యూటీ తహశీల్దార్‌లు ఎం.సోమేశ్వరరావు, వి.కిషోర్ కుమార్, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.



ఉండిలో అవగాహనా ర్యాలీ


గణపవరం : ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని గణపవరం తహశీల్దార్ వైవి.అప్పారావు అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక డిగ్రీ కాలేజీలో జరిగిన ఓటర్ల దినోత్సవం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రామానికి ప్రిన్సిపల్ పి.నిర్మలాకుమారి అధ్యక్షత వహించారు. సీనియర్ ఓటర్లకు సన్మానం నిర్వహించి, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. వైస్ ప్రిన్సిపల్ మధురాజు, అధ్యాపకులు, కాలేజీ సిబ్బంది పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : ఓటు హక్కు సామాజిక బాధ్యత అని, ఓటు హక్కు వినియోగించుకొని ఓటర్లకు ప్రభుత్వ పథకాలు నిలిపివేయాలని ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. శనివారం తాడేపల్లిగూడెం తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో జరిగిన 15వ జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లిగూడెం రెవెన్యూ అధికారి ఖతీబ్ కౌసర్ భనో మాట్లాడారు. సీనియర్ సిటిజన్ ఓటర్లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సునీల్ కుమార్, కమిషనర్ ఏసుబాబు పాల్గొన్నారు.

ఆకివీడు : ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తహశీల్దార్ నండూరి వెంకటేశ్వరరావు సూచించారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా శనివారం ఆకివీడులోని దుంపగడప వివిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, స్థానిక జిల్లా పరిషత్ బాలుర హై స్కూల్ విద్యార్థులతో జాతీయ రహదారి గుండా ప్రదర్శన నిర్వహించి, స్థానిక పాత బస్టాండ్ సెంటర్‌లోని సిద్దాపురం రోడ్డు సెంటర్లో విద్యార్థులతో మానవహారం నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయ అధికారి శ్రీకర్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సుజాత, ఎంఇఒ ఎ.రవీంద్ర, పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ హెచ్.నాగరాజు, జడ్‌పి హైస్కూల్ హెచ్‌ఎం పోతరాజు పాల్గొన్నారు.

మొగల్తూరు : 18 సంవత్సరాల నిండిన ప్రతి ఒక్కరూ తమ ఓటు నమోదు చేసుకోవాలని తహశీల్దార్ కె.రాజకిషోర్ సూచించారు. మండల కేంద్రం మొగల్తూరులోని పెనుమత్స రంగరాజా జడ్‌పి ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు వర్ధమాన రవిశంకర్ సర్కార్ ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ల దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. డిప్యూటీ తహశీల్దార్ సంధ్య, రెవెన్యూ, పాఠశాల సిబ్బంది ఉన్నారు. ముత్యాలపల్లి గ్రామంలో ఆరోగ్య వర్షిని ట్రస్ట్ ఛైర్మన్ నాగిడి రాంబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు.

నరసాపురం : మండలంలోని సీతారాంపురం స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముందుగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, ముగ్గుల పోటీ పెట్టి విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆర్‌డిఒ దాసిరాజు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు చాలా కీలకమైందన్నారు. సీనియర్ ఓటర్లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ టి.రాజరాజేశ్వరి, డీటీ ప్రసాద్, ఆర్‌ఐ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.


పాలకొల్లురూరల్‌లో..

పాలకొల్లురూరల్ : మండలంలోని కాపవరం గ్రామ సచివాలయంలో ఓటర్ల దినోత్సవం సందర్భంగా మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్ రావు ఎక్కువసార్లు ఓటు హక్కు వినియోగించుకున్న సీనియర్ సిటిజన్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి కోలాటి రాధ, సెక్రటరీ డి.శ్రీనివాసరావు, విఆర్‌ఒ సత్యనారాయణ, బ్రహ్మం, రంగరాజు, గూడూరు నరసింహమూర్తి పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ పురుషుల జట్టు ఎంపిక

పెనుమంట్ర : విజయవాడలో ఈనెల 28 నుంచి 31వ తేదీ వరకు జరిగే ఆంధ్రప్రదేశ్ 1వ అంతర్ జిల్లాల పురుషుల, మహిళల బాస్కెట్ బాల్ టోర్నమెంట్‌కు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల పురుషుల జట్టు జాబితాను ఎంపిక కమిటీ అధ్యక్షులు పీడీ కర్రి కృష్ణారెడ్డి తెలిపారు. ఈ ఎంపికలు మండలంలోని మార్టేరు ఎస్‌విజి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో శనివారం రాత్రి నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులు కెకె.రవితేజ రెడ్డి, కెబిఎస్ రెడ్డి, కె.లోకేష్, కె.డానీ జోసెఫ్, పి.గణేష్, ఎ.సూర్య కిరణ్, కె.మణికంఠ రెడ్డి, జి.రోహిత్ సాయి కుమార్, ఆర్.విజయ్ కుమార్, ఎస్.కిషోర్, పి.సూర్య తేజ, వి.ధరణి ధర్, వి.సాయి కిరణ్, జె.శివకృష్ణ, పి.విష్ణు సాయి, కె.అవినాష్ ఎంపిక అయ్యారని, వీరు టోర్నమెంట్‌కు వెళ్తారన్నారు.

ఆక్యూప్రెజర్‌తో అద్భుత చికిత్స

ప్రముఖ ఆక్యూ ప్రెజర్ వైద్యులు డాక్టర్ తాన్‌రాజ్ చౌదరి

పెనుమంట్ర : ప్రపంచంలో అత్యుత్తమ వైద్య విధానం ఆక్యూ ప్రెజర్ చికిత్సా విధానమని, నూటికి నూరుశాతం ఫలితాలు వస్తున్నాయని ప్రముఖ ఆక్యూ ప్రెజర్ వైద్యులు డాక్టర్ తాన్‌రాజ్ చౌదరి(జోద్ పూర్)అన్నారు. స్థానిక మండలంలోని మార్టేరు గ్రామంలో ఖండవల్లి కిషోర్ ఛారిటబుల్ ట్రస్ట్ ప్రాంగణంలో శనివారం ఆరు రోజుల ఉచిత చికిత్సా శిబిరాన్ని ఆయన ప్రారభించారు. మండల మానవతా శాఖ, ఖండవల్లి కిషోర్ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ శిబిరంలో ట్రస్ట్ ప్రతినిధి, నరసాపురం ఆర్‌టిసి డిపో మేనేజర్ సత్తి సుబ్బన్న రెడ్డి, మార్టేరు ఉప సర్పంచి కర్రి వేణుబాబు, మానవత జిల్లా కమిటీ కార్యదర్శి కొత్త సత్యనారాయణ మూర్తి, మండల మానవత శాఖ అధ్యక్షులు కర్రి కృష్ణారెడ్డి, ఎంపిటిసి గుడిమెట్ల లక్ష్మణ్ రెడ్డి పాల్గొన్నారు.

రహదారిని అభివృద్ధి చేస్తాం : ఎంపిపి

వీరవాసరం : గత 15 సంవత్సరాలుగా అభివృద్ధికి నోచుకోని నడపనవారిపాలెం కొత్త కాలనీలో రహదారిని అభివృద్ధి చేస్తానని ఎంపిపి వీరవల్లి దుర్గాభవానీచంద్రశేఖర్ స్థానికులకు హామీ ఇచ్చారు. శనివారం ఆ గ్రామంలో ప్రాథమిక పాఠశాల ప్రారంభోత్సవ కార్యక్రమంకు సంబంధించి పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులు రహదారి, విద్యుత్ సదుపాయం సమస్యలను ఎంపిపి దృష్టికి తీసుకొచ్చారు. ఈ కాలనీలో సుమారు 10 కుటుంబాలు ప్రభుత్వ ఇల్లు నిర్మించుకున్నారన్నారు. నాటి నుంచి ఈ కాలనీలో విద్యుత్ సదుపాయం, రాకపోకలు సాగించేందుకు సరైన రహదారి లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. వర్షాకాలంలో నడిచేందుకు వీలు లేకుండా ఈ మార్గం ఉందన్నారు. అదేవిధంగా విషసర్పాలు కూడా సంచరిస్తున్నాయని, విద్యుత్ సదుపాయం లేకపోవడంతో పాముల వల్ల భయపడుతున్నామని తెలిపారు. ఎంపిపి సానుకూలంగా స్పందించి ప్రస్తుతం నిధుల లభ్యత తక్కువగా ఉందని, నిధులు సమకూరిన వెంటనే రహదారి అభివృద్ధి చేస్తానని వారికి చెప్పారు. ఎంపిపి వెంట వైస్ ఎంపిపి అడ్డాల శ్రీరామచంద్రమూర్తి, ఎంఇఒ శ్రీమన్నారాయణ ఉన్నారు.

ఆదిత్యలో మెగా రక్తదాన శిబిరం

తాడేపల్లిగూడెం : రక్తదానం చేయడం సామాజిక బాధ్యతని ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మీ సరోజ తెలిపారు. శనివారం స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ప్రిన్సిపల్ లక్ష్మీ సరోజ మాట్లాడుతూ రక్తదానం ప్రాముఖ్యత, ఆరోగ్య ప్రయోజనం సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో విద్యార్థులకు కాని, వారి కుటుంబసభ్యులకు కాని రక్తం అవసరం ఉంటే మేము సహాయం చేయడం జరుగుతుందని తెలిపారు. డైరెక్టర్ కె.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఆదిత్య అంటేనే ఎన్ఎస్ఎస్ అని, మా ప్రణాళిక విద్యార్థి భవిష్యత్‌కు ఉపయోగపడేలా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో 40 యూనిట్ల బ్లడ్ రెడ్ క్రాస్‌కు అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ఆఫీసర్, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలి : సిపిఎం

పెనుగొండ : స్మార్ట్ మీటర్ల వల్ల కలిగే విద్యుత్ భారాలు, మీటర్ల రేడియేషన్ వల్ల వచ్చే ఆరోగ్య సమస్యలపై సిపిఎం ఆధ్వర్యంలో పెనుగొండలో మైక్ ప్రచారం నిర్వహించారు. పెనుగొండ గ్రామంలోని జిల చెరువు నుంచి రామచంద్రరావు పేట కోడిపందాల దిబ్బ, ఇందిరా శాంతినగర్, చెరుకువాడ, పెనుగొండ ప్రాంతాల్లో ఇంటింటికి, వీధి, వీధినా కరెంటు స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని ప్రచారం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి షేక్ పాదుషా మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం గౌతమ్ అదానీతో కుదుర్చుకున్న గ్రీన్ ఎనర్జీ ఒప్పందాన్ని టిడిపి కూటమి ప్రభుత్వం కొనసాగించి, ట్రూ అప్ ఛార్జీల పేరుతో ప్రజలపై వేలాది కోట్ల భారం విధించడం అన్యాయమన్నారు. ప్రజలు, వ్యాపారస్తులు ఈ స్మార్ట్ మీటర్ల విధానం వ్యతిరేకించాలన్నారు. సిపిఎం నాయకులు, జిల్లా కమిటీ సభ్యులు ఎస్.వెంకటేశ్వరరావు, మాదాసు నాగేశ్వరరావులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మోడల్ పేపర్లు అందజేత

ప్రజాశక్తి - గణపవరం


పిప్పరలో విద్యార్థులకు మోడల్ పేపర్లు అందచేస్తున్న ఎంఇఒ బాలయ్య, యుటిఎఫ్ నాయకులు

విద్యార్థులు యుటిఎఫ్ నాయకులు రూపొందించిన పదో తరగతి మోడల్ పేపర్లు వినియోగించుకొని పరీక్షలకు సిద్ధం కావాలని గణపవరం ఎంఇఒ జి.బాలయ్య అన్నారు. శనివారం పిప్పర జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు యుటిఎఫ్ నాయకులు రూపొందించిన మోడల్ పేపర్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న యుటిఎఫ్ జిల్లా నాయకులు వోతా ఆంజనేయులు మాట్లాడుతూ యుటిఎఫ్ టీచర్ల సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేయడమే కాకుండా విద్యార్థుల విద్యాభివృద్ధికి తనవంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యార్థులకు పుస్తకాల పంపిణీకి ఆర్థిక సహకారం అందించిన హెచ్‌ఎస్‌వివి.ఆంజనేయులుకి, చిత్తజల్లు పద్మకి, దాతలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విఒఎలపై రాజకీయ వేధింపులు ఆపాలి

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు సత్యనారాయణ

ప్రజాశక్తి - నరసాపురం

చాలీచాలని జీతాలతో పనిచేస్తున్న విఒఎలపై రాజకీయ వేధింపులు వెంటనే ఆపాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు తెలగంశెట్టి సత్యనారాయణ అన్నారు. శనివారం పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో ఎపి విఒఎ ఉద్యోగుల మండల జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కట్టి దుర్గ, పెనుగొండ జ్యోతి రత్నం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ విఒఎల మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్ రద్దుచేసి, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. మండలంలో విఒఎలపై రాజకీయ వేధింపులు పెరిగాయని, గత 20 సంవత్సరాలుగా పనిచేస్తున్న విఒఎలను తొలగించాలని ప్రయత్నం చేస్తున్నారని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా విఒఎలను తొలగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈనెల 27, 28, 29 తేదీల్లో కలక్టరేట్ దగ్గర ధర్నాలో విఒఎలు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్.భాను, జి.స్వాతి, డి.మణి, వై.ప్రభావతి, జి.సూర్యకళ, జె.లక్ష్మీ, జె.గీత, ఎస్.వరలక్ష్మీ, జి.మల్లీశ్వరి పాల్గొన్నారు.

సమాజంలో స్త్రీ పాత్ర కీలకం

మైనార్టీ వ్యవహారాల సలహాదారుడు ఎంఎ.షరీఫ్

ప్రజాశక్తి - నరసాపురం

నేటి సమాజంలో స్త్రీపాత్ర వెలకట్టలేనిదని మైనార్టీ వ్యవహారాల సలహాదారుడు ఎంఎ.షరీఫ్ అన్నారు. భేటీ బచావో, భేటీ పడావో 10వ వార్షికోత్సవం సందర్భంగా నరసాపురంలో 2కె రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్, డిఎస్‌పి డాక్టర్ జి.శ్రీవేద ప్రారంభించారు. పట్టణంలోని మిషన్ హై స్కూల్ నుంచి ప్రారంభమైన రన్ అంబేద్కర్ సెంటర్ వరకు సాగింది. అంబేద్కర్ సెంటర్‌లో మానవహారం చేశారు. అనంతరం జరిగిన సభలో మైనార్టీ వ్యవహారాల సలహాదారుడు ఎంఎ.షరీఫ్ మాట్లాడుతూ పుట్టుక నుంచి మరణం వరకు ఆమె చేపట్టలేని పాత్ర అంటూ ఏదీ ఉండదని, మహిళలను చదివించి, గౌరవించినప్పుడే సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. విప్, ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ సమాజంలో బాల్యవాహాలు అరికట్టాలని, కుటుంబాల్లో బాలురతో పాటు బాధితులను కూడా చదివించి వారి అభ్యున్నతికి తల్లిదండ్రులు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ దాసిరాజు, డిఎస్‌పి డాక్టర్ శ్రీవేద, మున్సిపల్ ఛైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకట రమణ, మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య పాల్గొన్నారు.

పశువైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - ఉండి

ఉచిత పశువైద్య శిబిరాలను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని పశు సంవర్ధక శాఖ ఉండి సహాయ సంచాలకులు పి.శ్రీదేవి అన్నారు. శనివారం ఉండి మండలం యండగండి గ్రామంలో నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరంలో పాల్గొన్న శ్రీదేవి మాట్లాడుతూ గ్రామాల్లో నిర్వహించిన పశువైద్య శిబిరంలో 300 పశువులకు వ్యాక్సినేషన్ ఇవ్వడం జరిగిందని, 200 కోళ్లకు వ్యాక్సిన్ వేయడం జరిగిందన్నారు. అదేవిధంగా 86 పాడి పశువులకు చికిత్స అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి టి.హేమ, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నరసాపురం : మండలంలోని ఎల్‌బి చర్ల గ్రామంలో శనివారం పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచి గుబ్బల యమునా భాను మూర్తి, ఉప సర్పంచి కటకంశెట్టి నరసింహమూర్తి ప్రారంభించారు. మండల పశువైద్యాధికారి ఐ.సురేంద్ర కుమార్ మాట్లాడుతూ ఈనెల 31 వరకు పశువైద్య శిబిరాలు జరుగుతాయని, పశువుల రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామంలో 300 మేకలు, గొర్రెలకు నట్టల మందులు, 260 కోళ్లకు టీకాలు వేశారు. అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది నారా కృష్ణసాయి, చందు కుమార్, గుబ్బల వీరాస్వామి, కటకంశెట్టి జగన్ పాల్గొన్నారు.


నరసాపురంలో..

ప్లాస్టిక్ వాడితే కఠిన చర్యలు

భీమవరం టౌన్ : ప్లాస్టిక్ నిషేధిత కార్యక్రమంలో భాగంగా శనివారం జెసి, స్పెషల్ ఆఫీసర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, కమిషనర్ కె.రామచంద్రారెడ్డి పట్టణంలోని కొన్ని షాపులను తనిఖీ చేశారు. షాపుల్లో ఎవరూ కూడా ప్లాస్టిక్ వాడకాన్ని నిర్మూలించాలని తగు సూచనలు జారీ చేశారు. వీరితోపాటు అసిస్టెంట్ కమిషనర్ వెంకటేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

హోమియో వైద్యులుగా శాస్త్రి బాధ్యతలు

నరసాపురం: మండలంలోని యర్రంశెట్టిపాలెం గ్రామం పితాని మెరక ప్రభుత్వ హోమియో ఆసుపత్రిలో డాక్టర్ పోస్టును ఎట్టకేలకు ప్రభుత్వం భర్తీ చేసింది. గత మూడేళ్లుగా శాశ్వత ప్రాతిపాదికన ఈ ఆసుపత్రికి వైద్యుడు లేకపోవడంతో ఇన్‌ఛార్జి డాక్టర్లు, సిబ్బంది రోగులకు వైద్య సేవలు అందించేవారు. ఈ నేపథ్యంలో హోమియో ఆసుపత్రికి శాశ్వత ప్రాతిపాదికన ప్రభుత్వం డాక్టర్‌ను నియమించింది. ఆసుపత్రి వైద్యులుగా డాక్టర్ ఆకెళ్ల విఎస్‌పికె శాస్త్రి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఒపి ద్వారా ఉచిత హోమియో వైద్య సేవలను మండల ప్రజలు వినియోగించుకోవాలన్నారు.